క్లుప్తంగా

అర్హులైన వారు దరఖాస్తు చేసుకోవాలి

ములుగు : ఎస్‌సీఈఆర్‌టీలో డిప్యూటేషన్‌పై విధులు నిర్వహించడానికి జిల్లాలో అర్హత కలిగిన ప్రధానోపాధ్యాయులు, స్కూల్ అసిస్టెంట్లు ఈ నెల 17 వరకు సంబంధిత సైట్‌లో ఆన్‌లైన్ దరఖాస్తు చేసుకోవాలని జిల్లా విద్యాశాఖ అధికారి డాక్టర్ అబ్దుల్ హై శనివారం ప్రకటనలో సూచించారు. దరఖాస్తు చేసుకునే వారు 58 ఏళ్ల లోపు వయస్సు కలిగి పీజీ, ఎంఈడీ అర్హత ఉండాలని పేర్కొన్నారు. డిప్యూటేషన్ కాలపరిమితి రెండేళ్లు ఉంటుందని తెలిపారు. ఆన్‌లైన్ దరఖాస్తులను గడువులోగా డీఈఓ కార్యాలయంలో అప్పగించాలని సూచించారు.

పథకాలు అర్హులందరికీ అందేలా చూడాలి



గోవిందరావుపేట: ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాలు అర్హులైన వారందరికీ చూడాలని కాంగ్రెస్ జిల్లా పార్టీ కార్యదర్శి గనిపాక సుధాకర్ అన్నారు. మండల కేంద్రానికి ఇటీవలే బదిలీపై వచ్చి బాధ్యతలు చేపట్టిన తహసీల్దార్ సృజన్ కుమార్‌ను సుధాకర్ మర్యాద పూర్వకంగా కలిసి శాలువ కప్పి సత్కరించారు. ఆయన వెంట జిల్లా బీసీ సెల్ ప్రధాన కార్యదర్శి కాసర్ల రాంబాబు, సీనియర్ నాయకులు కందాల వెంకన్న, చుక్క కొంరయ్య, గజ్జల రాజేష్ తదితరులు ఉన్నారు.

గ్యాస్ సిలిండర్లు సీజ్



గోవిందరావుపేట: మండలంలోని పస్రా గ్రామంలో అక్రమంగా నిల్వ చేసిన గ్యాస్ సిలిండర్లను విజిలెన్స్ అధికారులు శనివారం సీజ్ చేశారు. వివరాలు ఇలా ఉన్నాయి. పస్రాకు చెందిన రెడ్డి పురుషోత్తంరెడ్డికి చెందిన కాంప్లెక్స్‌లోని రూంను విశ్వసనీయమైన సమాచారం మేరకు శనివారం ఉదయం తనిఖీ చేశారు. అక్రమంగా నిల్వ చేసిన 85 సిలిండర్లను గుర్తించి ఇద్దరు సివిల్ సప్లయ్ అధికారుల సమక్షంలో సీజ్ చేసి క్రిమినల్ కేసు నమోదు చేసినట్లు తహసీల్దార్ సృజన్ కుమార్ తెలిపారు. కార్యక్రమంలో విజిలెన్స్ అధికారులు, సివిల్ సప్లయీస్ అధికారులు పాల్గొన్నారు.

రేపు ఆలయ వార్షికోత్సవం



ఏటూరునాగారం: మండల కేంద్రంలోని ఓడవాడలోఅభయాంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠ ప్రథమ వార్షికోత్సవం ఈనెల 12న నిర్వహించనున్నట్లు నిర్వాహకులు కందగట్ల రమేష్, పానెం సాంబశివరావు తెలిపారు. ఉదయం 4 గంటలకు గణపతి పూజ, 5 గంటలకు పంచామృత అభిషేకాలు, స్వామికి అలంకరణ, అష్టోత్తరణ, నామార్చన, హోమం, మహానివేదన, 12 గంటలకు మంత్రపుష్పము, మహాఅన్నదాన కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు. అనంతరం 3 గంటలకు శోభాయాత్ర జరుగుతుందని వివరించారు. మండలంలోని భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వారు కోరారు.

'గృహలక్ష్మి'పై పంచాయతీ సిబ్బంది సర్వే



వెంకటాపురం(కె): ప్రజాపాలనలో గృహలక్ష్మి పథకంలో రూ.500 గ్యాస్ సిలిండర్ కోసం దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారుల ఇంటికి వెళ్లి స్థానిక మేజర్ పంచాయతీ సిబ్బంది శనివారం సర్వే నిర్వహిస్తున్నారు. ప్రజా పాలనలో దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారులు కొందరు తప్పులు రాయడం, తప్పులను సరిచేసేందుకు పంచాయతీ కార్యదర్శి ప్రవీణ్ ఆధ్వర్యంలో సిబ్బంది ఇంటింటికీ వెళ్లి వివరాలను సేకరించి తప్పులను సరి చేస్తున్నారు.

ఎన్‌ఆర్‌ఐ భక్తుల మొక్కులు

ఏటూరునాగారం: మేడారంలోని సమ్మక్క సారలమ్మ అమ్మవార్లను ఎన్‌ఆర్‌ఐకి చెందిన ఓరుగంటి సమ్మిరెడ్డి–జ్యోతి డప్పు చప్పుళ్లతో ఘనంగా అమ్మవార్లకు మొక్కులు సమర్పించారు. వనదేవతలకు పసుపు, కుంకుమ చల్లి,కొబ్బరికాయలు కొట్టి మొక్కులు సమర్పించారు.

ముమ్మరంగా సాగుతున్న వరినాట్లు

- తగ్గిన వాణిజ్యపంట సాగు
- వరి, మొక్కజొన్నపై రైతుల మొగ్గు



నాటు వేస్తున్న కూలీలు



ట్రాక్టర్‌తో దమ్ము చేస్తున్న రైతు



మొక్కజొన్న పంట

వాజేడు : మండలంలో యాసంగి వరినాట్లు ప్రారంభమయ్యాయి. నాట్లు వేయడం ఇప్పటికే ఆలస్యం అయినా రైతులు ముమ్మరంగా నాట్లు చేశారు. యాసంగిలో వాణిజ్య పంట వరిసాగు కంటే బాండ్ మొక్కజొన్న, బాండ్ వరి సాగుపై ఆసక్తిని కనబరుస్తున్నా రు. సన్నరకాలైన 1010, బతుకమ్మ, ఆర్‌ఎస్‌ఆర్ రకాలతో పాటు కామన్ రకాలైన 1061, 1064 రకాల వంగడాలను నార్లుగా పోసి అవి పెరగడంతో నాట్లను ప్రారంభించారు. అయితే ఎక్కువగా బాండ్ సాగువైపే అన్నదాతలు మొగ్గు చూపుతున్నారు.

తగ్గిన వాణిజ్యపంట సాగు

ప్రతీ సంవత్సరం కమర్షియల్ సాగువైపు మొగ్గు చూపే రైతులు ఈసారి బాండ్ వరి, మొక్కజొన్న, ఇతర పంటల వైపు మొగ్గు చూపుతున్నారు. 1001 రకం వరి పంటను ములుగు జిల్లాలో మిల్లర్లు కొనుగోలు చేస్తారో లేదో అనే అనుమానం కూడా వరి పంటను తగ్గించడానికి ఒక కారణంగా కనబడుతోంది. 1001 రకం సాగుపై రైతుల్లో గందరగోళం నెలకొంది. దీంతో ఇతర వరి రకాలతో పాటు వేరే పంటల వైపు ఆసక్తిని పెంచుకున్నారు.

బాండ్ వైపే మొగ్గు

వర్షాకాలం సాగు చేసిన వరి పంట దిగుబడులు భారీగా తగ్గడంతో రైతుల్లో వరి సాగుపై ఆసక్తి తగ్గింది. దీంతో బాండ్ వరితో పాటు మొక్కజొన్న పంటల వైపు మొగ్గు చూపుతున్నారు. మండలంలో బాండ్ వరిసాగు విస్తీర్ణం సుమారు 300 ఎకరాల్లో వేయగా బాండ్ మొక్కజొన్న మరో 200 ఎకరాల్లో సాగు చేశారు. ఇప్పటికే బాండ్ మొక్కజొన్నతో పాటు బాండ్ వరి నాట్లను వేశారు. మండల వ్యాప్తంగా గత ఏడాది 4000 ఎకరాల్లో యాసంగి పంటను సాగుచేయగా ఈ ఏడాది అది సుమారు 2000 ఎకరాల్లో ఉండనున్నట్లు తెలుస్తోంది. బాండ్‌పై మరో 300 ఎకరాల్లో వరి నాట్లను వేయగా బాండ్ మొక్కజొన్నను 200 ఎకరాల్లో వేశారు.

విద్యార్థులకు వైద్యపరీక్షలు



విద్యార్థులకు వైద్యపరీక్షలు నిర్వహిస్తున్న వైద్యబృందం

గోవిందరావుపేట: మండల కేంద్రంలోని కర్లపల్లి గిరిజన సంక్షేమ ఆశ్రమ ఉన్నత పాఠశాలలోని విద్యార్థులకు శనివారం ములుగు జిల్లాకేంద్రం వైద్య బృందం వివిధ రకాల వైద్యపరీక్షలు చేపట్టింది. 8, 9, 10 వ తరగతి చదువుతున్న విద్యార్థులకు హెచ్‌ఎం కల్తీ శ్రీనివాస్ దగ్గరుండి ఏఎన్‌ఎం ఆధ్వర్యంలో వైద్యపరీక్షలు నిర్వహించారు. కొంత మంది విద్యార్థుల్లో హిమోగ్లోబిన్ తక్కువగా ఉంటే వారికి వైద్యబృందం మాత్రలు ఇచ్చినట్లు శ్రీనివాస్ అన్నారు. వివిధ చర్మ వ్యాధులు, చెవి, గుండె సంబంధ సమస్యలు ఉన్న విద్యార్థుల వివరాలు తీసుకొని చికిత్స ఏర్పాట్లు చేస్తామని వైద్యబృందం తెలిపింది. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, వైద్యబృంద సభ్యులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థికసాయం



ఆర్థికసాయం అందజేస్తున్న రవి

ములుగు రూరల్: మండలంలోని పత్తిపల్లికి చెందిన బుర్ర ఐలయ్య గౌడ్ జనవరి 31న తాటిచెట్టు ఎక్కుతుండగా ప్రమాదవశాత్తూ చెట్టుపై నుంచి పడడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. శనివారం దశదిశకర్మ కార్యక్రమానికి కల్లుగీత కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి గుండెబోయిన రవి బాధిత కుటుంబ సభ్యులను ఓదార్చి రూ.10 వేల వారి కుటుంబానికి అందజేశారు. ఈ సందర్భంగా రవి గౌడ్, శ్రీనివాస్‌గౌడ్‌లు మాట్లాడుతూ ఐలయ్య కుటుంబానికి రూ.10 లక్షల ఎక్స్‌గ్రేషియా ప్రభుత్వం అందించాలని డిమాండ్ చేశారు. పరామర్శించిన వారిలో ఉద్యోగుల సంఘం జిల్లా ప్రచార కార్యదర్శి తిప్పని కృష్ణ, మొండయ్య, భిక్షపతి, శ్రీనివాస్, సంతోష్, వీరస్వామి, ప్రభాకర్, సత్యనారాయణ, అశోక్ తదితరులు ఉన్నారు.

కుష్ఠు వ్యాధిపై అవగాహన



కుష్ఠువ్యాధిని నిర్మూలించాలని ప్రతిజ్ఞ చేస్తున్న వైద్యాధికారి మధుకర్, తదితరులు

వాజేడు: మండలంలోని జగన్నాథపురంలో కుష్ఠు వ్యాధిపై గ్రామస్తులకు జిల్లా వైద్య శాఖాధికారుల ఆదేశాల మేరకు స్థానిక వైద్యాధికారి మధుకర్ ఆధ్వర్యంలో ఆరోగ్యశాఖ సిబ్బంది శనివారం అవగాహన సదస్సు నిర్వహించారు. కుష్ఠువ్యాధి ఉన్న వారిలో మనోధైర్యం నింపాలన్నారు. వారిని కుటుంబ సభ్యులు దూరంగా ఉంచవద్దని కోరారు. గోధుమరంగు మచ్చలు కనిపిస్తే వెంటనే స్థానిక వైద్యశాలకు వచ్చి పరీక్షలను చేయించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో జయరాజ్, కోటిరెడ్డి, రాజేశ్వరి, కవిత, జ్యోతి, నాగమణి, నాగలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీలో అక్షరాభ్యాసం



అక్షరాభ్యాసం చేయిస్తున్న అంగన్‌వాడీ సూపర్‌వైజర్ రమాదేవి, హెచ్‌ఎం సతీష్‌రెడ్డి

రేగొండ: మండలంలోని రామన్నగూడెం తండా ప్రాథమిక పాఠశాలలో అంగన్‌వాడీ సూపర్‌వైజర్ రమాదేవి, పాఠశాల ప్రధానోపాధ్యాయులు కామిడి సతీష్‌రెడ్డి ఆధ్వర్యంలో పిల్లలకు అక్షరాభ్యాసం కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా విద్యార్థులకు ఓంకారం అక్షరాన్ని దిద్దించారు. అనంతరం హ్యాండ్‌వాష్ కార్యక్రమాన్ని నిర్వహించి చేతులను శుభ్రం చేసుకునే విధానాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. భోజనానికి ముందు ప్రతి ఒక్కరూ చేతులను శుభ్రం చేసుకోవాలని, తద్వారా వ్యాధుల నుంచి రక్షణ పొందవచ్చని సూచించారు. అంగన్‌వాడీ టీచర్ బుర్ర సరస్వతి, ఉపాధ్యాయులు కుసుమ వెంకన్న, ఏఎన్‌ఎం సదాలక్ష్మీ, ఆశా కార్యకర్త అనిత పాల్గొన్నారు.

గ్రామాల్లో కొనసాగుతున్న స్పెషల్ డ్రైవ్



పనులను పరిశీలిస్తున్న అధికారులు

కాటారం: మండలంలోని గ్రామ పంచాయతీల్లో శానిటేషన్ స్పెషల్ డ్రైవ్ కార్యక్రమాలు కొనసాగుతున్నాయి. శనివారం ఆయా గ్రామ పంచాయతీల్లో పారిశుద్ధ్య కార్యక్రమాలను జీపీల ప్రత్యేకాధికారులు పర్యవేక్షించారు. డ్రెయినేజీల పూడికతీత, చెత్తాచెదారం తొలగింపు కార్యక్రమాలను పరిశీలించారు. దోమల నివారణకు ఆయిల్ బాల్స్ ఉపయోగించాలని, రోజు సాయంత్రం ఫాగింగ్ చేయాలని పంచాయతీ కార్యదర్శులను ఆదేశించారు. పారిశుద్ధ్య కార్యక్రమాలను పకడ్బందీగా కొనసాగించాలని సూచించారు. గ్రామస్తులకు అవగాహన కల్పించాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమాల్లో ప్రత్యేకాధికారులు సంజీవరావు, ఎంపీడీఓ శంకర్‌నాయక్, తహసీల్దార్ నాగరాజు, ఎంపీఓ ఉపేంద్రయ్య, పంచాయతీ కార్యదర్శులు ఉమాదేవి, షగీర్‌ఖాన్, రజిత, కృష్ణవేణి, కరుణాకర్, పంచాయతీ సిబ్బంది, కార్మికులు పాల్గొన్నారు.

పీఏసీఎస్ చైర్మన్‌పై అవిశ్వాసం?

కాటారం: కాటారం ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘం చైర్మన్ చల్ల నారాయణరెడ్డికి పదవి గండం ఎదురుకానున్నట్లు తెలుస్తోంది. పాలకవర్గం సభ్యులు అవిశ్వాసం దిశగా రంగం సిద్ధం చేస్తున్నట్లు సమాచారం. పాలవర్గంలోని 11 మంది డైరెక్టర్లు అవిశ్వాసం పెట్టేందుకు ప్రత్యేక క్యాంపునకు తరలివెళ్లినట్లు తెలిసింది. రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్‌బాబును హైదరాబాద్‌లో కలిసి ఒకటి రెండు రోజుల్లో డైరెక్టర్లు తమ అవిశ్వాసం తీర్మానాన్ని సంబంధిత ఉన్నతాధికారులకు అందజేసే అవకాశాలు ఉన్నాయి. కాగా ఫిబ్రవరి 15, 2020న పీఏసీఎస్ ఎన్నికలు జరగగా 13 మంది డైరెక్టర్లుగా ఎన్నికయ్యారు. ధన్వాడ నుంచి డైరెక్టర్‌గా చల్ల నారాయణరెడ్డి పోటీ చేసి గెలుపొందారు. బీఆర్‌ఎస్ పార్టీ మద్దతుతో గెలిచిన డైరెక్టర్లు ఎక్కువగా ఉండటంతో అప్పుడు బీఆర్‌ఎస్ పార్టీలో కొనసాగిన నారాయణరెడ్డి చైర్మన్ పదవిని సొంతం చేసుకున్నారు. అనంతరం జరిగిన పరిణామాలతో నారాయణరెడ్డి బీఆర్‌ఎస్ పార్టీకి గుడ్‌బై చెప్పి ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో బీఎస్పీ పార్టీ బీ–ఫాంతో మంథని ఎమ్మెల్యే స్థానానికి పోటీ చేసి ఓటమి పాలయ్యారు. ఇది ఇలా ఉండగా కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చినప్పటికి కాంగ్రెస్ నాయకులు పీఏసీఎస్ చైర్మన్ పీఠాన్ని తమ ఖాతాలో వేసుకోవాలని ఆరాటపడుతూ వస్తున్నారు. ఇందులో భాగంగా పలుమార్లు కాంగ్రెస్ నాయకులు బీఆర్‌ఎస్ మద్దతు డైరెక్టర్లతో రహస్యంగా బేటి అయి వారందరూ కాంగ్రెస్‌కు మద్దతు ఇచ్చేలా ఒక తాటిపైకి తీసుకొచ్చినట్లు తెలిసింది. పూర్తి స్థాయిలో డైరెక్టర్ల మద్దతు సాధించిన కాంగ్రెస్ నాయకులు అవిశ్వాసం ప్రక్రియను వేగవంతం చేసినట్లు సమాచారం. బీఆర్‌ఎస్ మద్దతు డైరెక్టర్లు మంత్రి శ్రీధర్‌బాబు సమక్షంలో కాంగ్రెస్ పార్టీ తీర్థం పుచ్చుకోనున్నారని తెలుస్తుంది. పీఏసీఎస్ చైర్మన్ పదవి కాలం మరో ఏడాది ఉండగా కాంగ్రెస్‌కు చెందిన డైరెక్టర్లలో ఎవరిని చైర్మన్ పదవి వరిస్తుందో అని ఉత్కంఠ కొనసాగుతోంది. అంతేకాకుండా మంత్రి శ్రీధర్‌బాబు సొంత మండలం కావడంతో ముస్ముందు రాజకీయం రసవత్తంగా ముందుకుసాగే అవకాశాలు ఉన్నట్లు పలువురు చర్చించుకుంటున్నారు.

గ్రావిటీ కాల్వలో పడిన దుప్పులు

కాళేశ్వరం: మహదేవపూర్ మండల సమీపంలోని గ్రావిటీ కాల్వలో తల్లి,పిల్ల దుప్పులు రెండు దాహం తీర్చుకోవడానికి గ్రావిటీ కాల్వలోకి దిగి ప్రమాదవశాత్తు పడిపోయాయి. దీంతో పైకి ఎక్కేందుకు ప్రయత్నం చేసినా దుప్పుల కాళ్లకు గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు ఫారెస్ట్ అధికారులకు సమాచారం ఇవ్వడంతో కాళేశ్వరం బీట్ ఆఫీసర్ ప్రశాంత్‌రెడ్డి సిబ్బందితో చేరుకొని తల్లి పిల్లలను బయటకు తీసి అడవిలోకి వదిలేశారు.

ఒకరు మంజూరు ఇచ్చారు.. మరొకరు ట్రంచ్ కొట్టారు

- కొరవడిన సమన్వయం
- ఎడ్లబండ్ల దారిలో ఏర్పడిన గుంతలు



కట్ చేసిన షాపెల్లి-మేడారం రోడ్డు అడవి బండ్ల రోడ్డు

ఏటూరునాగారం : మేడారం జాతర సందర్భంగా ఐటీడీఏ ఇంజనీరింగ్‌శాఖ నుంచి ఎడ్లబండ్ల దారి కోసం నిధులు కేటాయించింది. మండలంలోని షాపెల్లి నుంచి మేడారం వరకు సుమారు ఎడ్లబండ్ల దారి అడవిమార్గంలో ఉంటుంది. షాపెల్లి గ్రామ చివరిలో నుంచి అడవిమార్గం గుండా మేడారానికి ఎడ్లబండ్లు చేరుకునేందుకు ఐటీడీఏ ఇంజనీరింగ్ శాఖ రూ. 3లక్షలు మంజూరు చేయగా ఓ పార్టీకి చెందిన నాయకులు దానిని బ్లేడ్‌బండితో చదును చేసి మమా అనిపించారు. అయితే అడవిలో నుంచి వాహనాలు, ఎడ్లబండ్లు వస్తే అడవికి ప్రమాదం అని చెప్పి అటవీశాఖ అధికారులు ఈ దారిలోనే పలుచోట్ల గోతులు(ట్రంచ్‌లు) తీయించారు. ఒక శాఖ మంజూరు ఇస్తే మరోశాఖ దాని రవాణాను నిర్మూలించడం విడ్డూరంగా ఉంది. శాఖల మధ్య సమస్య కొరవడిందా... లేక కావాలనే ఇలా చేశారా అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. కానీ రూ.3లక్షలు ప్రజాధనం మాత్రం దుర్వినియోగమైనట్లు తెలుస్తోంది. ఎడ్లబండ్ల దారిలో నుంచి గతంలో ఎడ్లబండ్లు, ద్విచక్రవాహనాలు మేడారం చేరుకునే ఆనవాయితీ ఉంది. అటవీశాఖ అధికారుల ట్రంచ్‌తో ఈదారి మూసుకపోవడం ఇబ్బందిగా మారింది. దీనిపై ఉన్నతాధికారులు స్పందించి భక్తులకు ఇబ్బంది లేకుండా నిబంధనలు పాటించే పనులు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు. ఈ విషయంపై సెక్షన్ ఆఫీసర్ లింగంను వివరణ కోరగా అటవీశాఖ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఆ మార్గాన్ని ట్రంచ్‌లు కొట్టామన్నారు. అడవి మార్గంలో మంటలు, అడవికి ప్రమాదం జరిగే అవకాశం ఉందని రోడ్డును బంద్ చేయించినట్లు వెల్లడించారు.

షార్ట్ సర్క్యూట్‌తో పత్తి దగ్ధం

కాటారం: విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో పత్తి దగ్ధమైన సంఘటన మండలంలోని ధన్వాడ గ్రామపంచాయతీ పరిధిలోని కిష్టంపేటలో శుక్రవారం అర్ధరాత్రి చోటు చేసుకుంది. పానగంటి సమ్మయ్య అనే రైతు సుమారు 30 క్వింటాళ్ల పత్తి ఇంట్లో నిల్వ చేసుకున్నాడు. విద్యుత్ వైర్లు షార్ట్‌సర్క్యూట్ కావడంతో పత్తికి మంటలు అంటుకున్నాయి. కుటుంబసభ్యులు గమనించి మంటలు ఆర్పారు. సుమారు 10 క్వింటాళ్ల పత్తి దగ్ధమైనట్లు బాధితుడు తెలిపారు. సుమారు రూ.లక్ష నష్టం వాటిల్లినట్లు పేర్కొన్నారు. ప్రభుత్వం పరిహారం అందించి ఆదుకోవాలని రైతు కోరారు.

తహసీల్దార్ల బదిలీ

టేకుమట్ల: పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో తహసీల్దార్ల బదిలీల్లో భాగంగా టేకుమట్ల తహసీల్దార్ మంజుల వరంగల్ జిల్లాకు బదిలీపై వెళ్లింది. గత సంవత్సరం ఆగస్టులో విధుల్లో చేరగా ఏడు నెలల వ్యవధిలో శనివారం కొనసాగిన బదిలీల్లో స్థానచలనం పొందింది.

చిట్యాల తహసీల్దార్..

చిట్యాల తహసీల్దార్‌గా విధులు నిర్వర్తిస్తున్న సుమన్ పెద్దపల్లి జిల్లాకు బదిలీపై వెళ్లారు. ఆయన గత సంవత్సరం ఆగస్టులో విధుల్లో చేరారు.

మల్హర్: మండలంలో తహసీల్దార్‌గా విధులు నిర్వహిస్తున్న పిప్పిరి శ్రీనివాస్ బదిలీ అయ్యారు. ఈ మేరకు శ్రీనివాస్ మంచిర్యాల జిల్లాకు బదిలీ చేస్తున్నట్లు శనివారం ఉత్తర్వులు వెలుబడ్డాయి. గత రెండు నెలల క్రితం ఆయన మల్హర్ తహసీల్దార్‌గా బాధ్యతలు చేపట్టారు.

క్రీడాకారులకు అభినందన

భూపాలపల్లి రూరల్: హనుమకొండ జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియంలో ఈ నెల 8న నిర్వహించిన రాష్ట్రస్థాయి తెలంగాణ అమెచ్యూర్ రెజ్లింగ్ చాంపియన్‌షిప్‌లో జిల్లాకు చెందిన క్రీడాకారులు పాల్గొన్నారు. ఇందులో జిల్లాకు చెందిన బాలికల 58 కేజీల విభాగంలో కృతిక ద్వితీయ బహుమతి, 39 కేజీ విభాగంలో నిహారిక తృతీయ బహుమతి, 62 కేజీ విభాగంలో అన్విత తృతీయ బహుమతి, బాలురు 85 కేజీల విభాగంలో పార్థసారథి ద్వితీయ బహుమతి సాధించారని జిల్లా రెజ్లింగ్ అసోసియేషన్ అధ్యక్షులు కొటం రవి తెలిపారు. ఈ మేరకు శనివారం క్రీడాకారులను జిల్లా కేంద్రంలోని అంబేడ్కర్ స్టేడియంలో అభినందించారు.

పీఏసీఎస్ చైర్మన్‌గా కన్నెబోయిన కుమార్



కుమార్‌కు నియామకపత్రం అందిస్తున్న డీసీఓ

గణపురం: గణపురం పీఏసీఎస్ చైర్మన్‌గా కన్నెబోయిన కుమార్ యాదవ్ ఎన్నికయ్యాడు. బీఆర్‌ఎస్ పార్టీకి చెందిన చైర్మన్ పోరెడ్డి పూర్ణచంద్రారెడ్డిపై కాంగ్రెస్ పార్టీకి చెందిన 12 మంది డైరెక్టర్లు అవిశ్వాస తీర్మానం పెట్టడంతో అతడు పదవిని కోల్పోయాడు. దీంతో శనివారం డీసీఓ శైలజ సమక్షంలో సమావేశం ఏర్పాటు చేయగా 13 మంది డైరెక్టర్లకు గాను 11 మంది డైరెక్టర్లు హాజరై కుమార్‌కు మద్దతుగా చేతులు ఎత్తగా చైర్మన్‌గా ఎన్నికయ్యారు. ఈ మేరకు డీసీఓ నియామక పత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా కుమార్ యాదవ్ మాట్లాడుతూ.. తన ఎన్నికకు సహకరించిన ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావుకు కృతజ్ఞతలు తెలిపారు. సంఘం అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తానని అన్నారు.

అక్రమంగా డబ్బాల ఏర్పాటు



మాట్లాడుతున్న ప్రవీణ్‌కుమార్

భూపాలపల్లి అర్బన్: భూపాలపల్లి పట్టణంలో బస్టాండ్, ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆవరణలో డబ్బాలు (గుమ్టీలు) అక్రమంగా నిర్మిస్తున్నారని, వెంటనే తొలగించాలని సీపీఐ పట్టణ కార్యదర్శి సోత్కు ప్రవీణ్‌కుమార్ అధికారులను డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలోని రావినారాయణరెడ్డి భవన్‌లో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సీపీఐ పట్టణ కార్యదర్శి ప్రవీణ్‌కుమార్ మాట్లాడుతూ.. రాజకీయ నాయకులు, ఆర్థికంగా ఉన్న వాళ్లు కూడా అక్రమంగా డబ్బాలు వేసుకుంటున్నారని ఆరోపించారు. సంబంధిత సింగరేణి, రెవెన్యూ, మున్సిపాలిటీ అధికారులు వెంటనే వాటిని తొలగించాలని కోరారు. కొన్ని సంవత్సరాలుగా చిరువ్యాపారం చేసుకుంటూ రోడ్డు వెడల్పులో భాగంగా దుకాణాలు కోల్పోయిన వారు ఉన్నారన్నారని తెలిపారు. వారికి న్యాయం చేయకుండా నాయకులు, ధనవంతులు స్థలాలు కబ్జా చేసుకొని కిరాయికి ఇచ్చుకుంటూ సొమ్ము చేసుకుంటున్నారని ఆరోపించారు. ఇప్పటికైనా ప్రభుత్వం, అధికారులు స్పందించి చర్యలు చేపట్టాలని కోరారు. ఈ సమావేశంలో నాయకులు నేరెళ్ల జోసెఫ్, వేముల శ్రీకాంత్, అరబోయిన వెంకటేష్, కాంతారావు, రాసపల్లి భద్రయ్య, మహేష్, కమలాకర్, తదితరులు పాల్గొన్నారు.

సమన్వయంతో జాతర జరుపుకోవాలి

ఎస్‌ఎస్‌తాడ్వాయి: జాతరలో స్థానిక వ్యాపారులు, ఆదివాసీలు, అధికారులు సమన్వయంతో జాతరను జరుపుకోవాలని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు బొల్లు దేవేందర్ కోరారు. శనివారం మండల కేంద్రంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ సమ్మక్క సారలమ్మ జాతరకు కోటి మందికిపైగా భక్తులు హాజరవుతారని అధికారులు అంచనా వేశారన్నారు. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకొని మేడారం ఐల్యాండ్‌కు ఇరువైపులా ఉన్న షాపులను అధికారులు తొలగించడం జరిగిందన్నారు. షాపుల తొలగింపులో వ్యాపారులు, అధికారుల మధ్య సమన్వయం ఉండాలన్నారు. షాపుల తొలగింపు విషయంలో ప్రభుత్వాన్ని బదనాం చేయడం షాపుల యజమానులకు సమంజసం కాదన్నారు. అధికారులు ముందస్తు సమాచారం వ్యాపారులకు ఇచ్చి వారికి సమయం ఇచ్చి షాపులను తొలగించాలన్నారు. కొంత మంది నాయకులు కావాలని షాపుల తొలగింపు విషయాన్ని రాజకీయం చేస్తున్నారన్నారు.

కోడిపందేలా స్థావరాలపై దాడులు



నిందితుల నుంచి స్వాధీనం చేసుకున్న బైకులు

గోవిందరావుపేట: మండల కేంద్రంలోని పస్రా పోలీస్ స్టేషన్ పరిధిలో కోడిపందేలా స్థావరాలపై ఎస్సై షేక్ మస్తాన్ తన సిబ్బందితో శనివారం దాడులు నిర్వహించారు. పక్కా సమాచారం మేరకు కోడి పందాలు నిర్వహిస్తున్న స్థావరాలపై ఆకస్మిక దాడి చేశామని ఎస్సై తెలిపారు. ఈ దాడుల్లో 23 మంది నిందితులని అదుపులోకి తీసుకోగా మరికొంత మంది పరారీలో ఉన్నన్నారు. వారి నుంచి 26,457 నగదు, 30 బైకులు, 5 కోడి కత్తులు స్వాధీనం చేసుకున్నామని ఎస్సై షేక్ మస్తాన్ తెలిపారు.